

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 263 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం, 24, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్





అవినీతి సామ్రాజ్యానికి అసలుకు భయం ఎక్కడ?

దోచుకుంటాం.. పట్టుబడతాం.. పంచుకుంటాం..

సస్పెండ్ అవుతాం.. మళ్లీ విధుల్లోకి వస్తాం!

అవినీతిపరులకు కేసులు కొత్తేమీ కాదు

రాష్ట్రంలో విచ్చలవిడి అవినీతి పెరిగిపోతుంది

ఎంత అవినీతి చేసిన ఉద్యోగ భద్రతకు డోకా లేదు

అవినీతిపరులను వెంటాడుతున్న ఏసీబీ అధికారులు

దోచుకున్నదంతా దాచుకోవడంలో అవినీతిపరుల కళలే వేరు

అవినీతి చేయడం పట్టుబడడం జైలుకెళ్లడం దర్జాగా ఉద్యోగంలో చేరడం షరా మామూలే

అవినీతిని అంతమొందిస్తే తప్ప రాష్ట్రం బాగుపడదు

వేల కోట్ల రూపాయలు అవినీతి రూపంలో మాయమవుతున్నాయి

ప్రజా సొమ్మును పందికొక్కుల మేస్తున్నారు

అవినీతికి అతీతులు కానీ శాఖలు లేవు : డాక్టర్ బరిగెల శివ

తెలంగాణలో అవినీతి విచ్చలవిడిగా పెరుగుతోందని డాక్టర్ బరిగెల శివ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాధనాన్ని కాపాడాల్సిన కొందరు అధికారులు అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని అన్నారు. ఏసీబీ కేసులు, అరెస్టులు, సస్పెన్షన్లు జరిగినా తుది చర్యలు ఆలస్యం కావడం ఆందోళనకరమన్నారు. సస్పెన్షన్ అనంతరం తిరిగి విధుల్లోకి వస్తున్నారనే భావన అవినీతిపరుల్లో భయాన్ని తొలగిస్తోందని విమర్శించారు. వేల కోట్ల ప్రజాధనం అవినీతి రూపంలో పక్కదారి పడుతున్నా వ్యవస్థలో సమూల మార్పులు రావడం లేదన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల అక్రమ ఆస్తులపై సమగ్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. బినామీ ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు, ఆదాయానికి మించిన ఆస్తుల మూలాలను వెలికితీయాలని కోరారు. నిజాయితీగా పనిచేసే ఉద్యోగుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా అవినీతికి అవకాశం ఇవ్వకూడదన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి చట్టపరమైన హక్కులు కల్పిస్తూనే, దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. "అవినీతికి సస్పెన్షన్ సరిపోదు.. తుది చట్టపరమైన చర్యలే భయాన్ని కలిగించాలి" అని డాక్టర్ బరిగెల శివ స్పష్టం చేశారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2

## తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాలి

### లండన్‌లో తెలుగు ప్రవాసులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

**లండన్, 23 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రగతికి ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'తెలంగాణ రైజింగ్' లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలుగు ప్రవాసులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాస తెలంగాణ ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఆదివారం ఉదయం లండన్‌లో తెలుగు ప్రవాసులతో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రగతి, పెట్టుబడుల అవకాశాలపై ప్రవాసులతో చర్చించారు. తెలుగు సమాజం ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ఆత్మీయంగా ముచ్చటించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రవాసుల సహకారం అవసరమని పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్' లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా బలంగా ప్రచారం చేస్తూ రాష్ట్రానికి మంచి రాయబారులుగా నిలవాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రవాసులను కోరారు. తెలంగాణ అభివృద్ధి, పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలపై ప్రపంచానికి అవగాహన కల్పించడంలో ప్రవాసులు కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు.




## క్రమశిక్షణ "చర్యల్లో "కక్ష "సాధింపులు




- అధికారం ముందు ప్రజాబలం ఓడిపోతుంది • మధ్యస్థంగా ఎదిగిన నాయకులు రాజకీయాలను శాసిస్తున్నారు
- అధికార పదవుల కోసం పతాక స్థాయిలో దిగజారుతున్నారు
- కొండా సుస్మిత పటేల్ వాక్యాలపై ఎందుకింత దుమారం • బీసీ మంత్రి కొండా సురేఖను ఇంకెంతకాలం టార్గెట్ చేస్తారు • అగ్రవర్ణాల విమర్శలపై క్రమశిక్షణ చర్యలు ఎక్కడ • కాంగ్రెస్ పార్టీ విచ్ఛిన్నానికి కుట్రలు పన్నుతున్నది ఎవరు • వ్యాపారాలు, పైస సంపాదన, అధికార పదవులు ఇవే నా అభివృద్ధి అంటే • ప్రజల మేలు కోరలేకపోతున్న ప్రజా ప్రతినిధులు • ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు పట్ల తీవ్ర అసంతృప్తిలో ఉంటున్న ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులు • మంత్రి సురేఖపై చర్యలకు పూనుకుంటే రాష్ట్రం అట్టోడుకుతుంది
- ప్రభుత్వం ప్రతిపక్షాలపై దూషిస్తున్న మాటల కన్నా సుస్మితా పటేల్ మాటలు పెద్దవా.!
- రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో రెచ్చగొట్టే మాటలు మానుకోండి • డాక్టర్ బరిగెల శివ.

6

## బల్దియాలో నిబంధనకు తూట్లు.. ఆర్ఐలదే రాజ్యం..!?

### గ్రేటర్ వరంగల్‌లో ఒకే చోట ఆరేళ్లుగా తిష్ట.. ఫైళ్ల జాప్యం, అవినీతి ఆరోపణలపై ఉన్నతాధికారుల మౌనం...!

2




## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో డాక్టర్ బరిగెల శివ ఆత్మీయ భేటీ

**హైద్రాబాద్, 23 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**



తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను జై భీమ్ టీవీ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఆయన వాహనంలో ప్రయాణించడం ఎంతో ఆత్మీయంగా అనిపించిందని డాక్టర్ బరిగెల శివ తెలిపారు. అనంతరం మినిస్టర్ క్వార్టర్స్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చూపించిన ఆప్యాయత, అభిమానం తనను ఎంతో ఆకట్టుకున్నాయని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. మంత్రి చూపిన ఆదరణ, ఆత్మీయతను ఎప్పటికీ మరచిపోలేనని అన్నారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య పలు అంశాలపై ఆత్మీయంగా చర్చ జరిగినట్లు తెలిపారు. తనపై మంత్రి చూపిన అభిమానానికి డాక్టర్ బరిగెల శివ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మర్యాదపూర్వక భేటీలో ఎస్ఎస్ రాజు కూడా పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# సామాజిక సేవకుడు మర్రి రవికుమార్‌కు డాక్టరేట్



**హన్మకొండ, 23 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

సామాజిక సేవా రంగంలో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ సామాజిక సేవకుడు, జర్నలిస్ట్ మర్రి రవికుమార్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన హైదరాబాద్‌కు చెందిన తెలుగు సంస్కృతి సాహితి సేవా ట్రస్ట్, తెలంగాణ సంస్కృతి సాహితి బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థలు గౌరవ డాక్టరేట్ అవార్డు--2026ను ప్రదానం చేశాయి. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం భావుపేట గ్రామానికి చెందిన మర్రి రవికుమార్ గత కొన్నేళ్లుగా నిరంతరం స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరుపేదలు, అభాగ్యులకు అండగా నిలుస్తున్నారు. నిరుపేదలకు వైద్య సహాయం అందించడం, అన్నదానం, రక్తదానం, నిరుపేద కుటుంబాలు, అనాథాశ్రమాలకు బియ్యం తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం వంటి అనేక సేవా కార్యక్రమాలను తన సొంతంగా నిర్వహిస్తున్నారు. రవికుమార్ సేవలను గుర్తించిన జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ 2023లో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బంగారు నంది అవార్డు--2023తో సత్కరించింది. అంతేకాకుండా ఆయన సేవా కార్యక్రమాలకు అనేక అవార్డులు, ప్రశంసా పత్రాలు లభించాయి. ఈ సందర్భంగా డాక్టర్ మర్రి రవికుమార్ మాట్లాడుతూ.. తన చిన్ననాటి నుంచే తల్లిదండ్రులు మర్రి జక్కమ్మ, ఉప్పలయ్య తనకు సేవా స్ఫూర్తిని అందించారని తెలిపారు. నిరుపేదలు, అభాగ్యులకు తమకు ఉన్నదాంట్లో కొంతైనా సహాయం చేయాలని వారు చెప్పిన మాటలు ఇప్పటికీ తనకు స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు. తనకు డాక్టరేట్ రావడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని రవికుమార్ అన్నారు. భవిష్యత్‌లో తన తల్లిదండ్రుల పేరుతో ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడమే తన లక్ష్యమని తెలిపారు. తన జీవిత సహచరి మంజుల అందిస్తున్న సహకారం, ప్రోత్సాహం తన విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. మర్రి రవికుమార్‌కు డాక్టరేట్ లభించడం పట్ల భావుపేట గ్రామ ప్రజలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, జర్నలిస్టు మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# మోత్కూరులో 3 పేస్ 24 గంటల కరెంట్ కావాలని ధర్నా



**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

వికారాబాద్ జిల్లా దోమ మండలంలోని మోత్కూరు గ్రామంలో, ఆదివారం ఉదయం స్థానిక గ్రామ రైతులందరూ కలిసి సబ్ స్టేషన్ లో ధర్నా నిర్వహించారు. 3 ఫేస్ కరెంటు లేక వేసిన పంటలు ఎండిపోతున్నాయంటూ వాపోయారు. రైతులకు 24 గంటల కరెంటు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు 12:00 కు కూడా సరిగ్గా ఇవ్వడం లేదు, వేసిన పంటలు ఎండిపోయి భూమి నెర్రెలు బారుతున్నాయి అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దోమ మండల మాజీ వైస్ ఎంపీపీ గుర్మిట్కాల్ మల్లేశం ఏఈ తో మాట్లాడుతూ.. సాయంత్రం 5 గంటలకు 3 పేస్ కరెంట్ పోతే మల్ల ఉదయం 5 గంటలకు వస్తుంది, సాగు చేసుకున్న మాటలు అన్ని ఎండిపోతున్నాయి, మద్యలో ఎవరైనా ఎల్ సి తీసుకుంటే, ఆ టైమ్ కూడా కవర్ చేస్తలేరు, అసలే వర్షాకాలం లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు, కరెంట్ పోయి వస్తుంటే పారిన నీళ్లే మల్ల పడుతున్నాయి ముందుకు పోవడం లేదు, ఎప్పుడు చూసినా ఆ 12 గంటల సమయంలో బ్రేక్ డౌన్ అంటారు, చెట్ల సమస్యలు ఏమైనా ఉంటే ఎండాకాలంలో చూసుకోవాలి, అప్పుడు మేము కూడా సహకరిస్తాము రైతులు కూడా సహకరిస్తారు. ఇప్పుడు వరి నాట్లు వేసి ఎండపెట్టుకోవాల్సి వస్తుందని వారు మాట్లాడారు. గ్రామ రైతు ఎడ్ల చెన్నయ్య మాట్లాడుతూ.. 12 గంటల కరెంట్ లో కూడా కోత విధిస్తున్నారు, లైన్మన్ ను అడిగితే బ్రేక్ డౌన్ అని చెప్తున్నాడు, రైతులమంతా చాలా ఇబ్బంది పడుతున్నాం, వర్షాకాలం కూడా లేక బోర్లు ఆగి ఆగి పోస్తున్నాయి, కరెంట్ సమస్యను ఎవ్వరూ పరిష్కరిస్తలేరు, మేన్ లైన్ కింద ఉన్న చెట్టు కొమ్మలను కొడతలేరు, ఏఈ కూడా పట్టించుకోవడం లేదు, ఈ మసమస్య ను తొందరగా పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని అన్నారు.

# అవినీతికి ఆతిథ్యమిస్తున్నారు.?!

**అవినీతి సామ్రాజ్యానికి అసలుకు భయం ఎక్కడ?**
**దోచుకుంటాం.. పట్టుబడతాం.. పంచుకుంటాం..**
**సస్పెండ్ అవుతాం.. మళ్లీ విధుల్లోకి వస్తాం!**
**అవినీతిపరులకు కేసులు కొత్తేమీ కాదు**
**రాష్ట్రంలో విచ్చలవిడి అవినీతి పెరిగిపోతుంది**
**ఎంత అవినీతి చేసిన ఉద్యోగ భద్రతకు డోకా లేదు**
**అవినీతిపరులను వెంటాడుతున్న ఏసీబీ అధికారులు**
**దోచుకున్నదంతా దాచుకోవడంలో అవినీతిపరుల కళలే వేరు**
**అవినీతి చేయడం పట్టుబడడం జైలుకెళ్లడం దర్జాగా ఉద్యోగంలో చేరడం షరా మామూలే**
**అవినీతిని అంతమొందిస్తే తప్ప రాష్ట్రం బాగుపడదు**
**వేల కోట్ల రూపాయలు అవినీతి రూపంలో మాయమవుతున్నాయి**
**ప్రజా సొమ్మును పందికొక్కుల మేస్తున్నారు**
**అవినీతికి అతీతులు కానీ శాఖలు లేవు**
**డాక్టర్ బరిగెల శివ**

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

తెలంగాణ రాష్ట్రంలో అవినీతికి అబ్దుల్ లేకుండా పోతున్నాయి అని డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా హెచ్చరించారు. అవినీతి చేస్తూ పట్టుబడుతున్న అవినీతిపరులంతా ప్రభుత్వ శాఖలను శాసిస్తున్నారని మండిపడ్డారు. అవినీతిపరుల బాగోతాలను పూర్తిస్థాయిలో వివరించారు. ఏసీబీ కేసులు పడినా.. సస్పెన్షన్ వేటు వేసినా.. దర్యాప్తులు సాగినా.. సంవత్సరాల తర్వాత మళ్లీ అదే కుర్చీలో కూర్చుంటే – అవినీతిపరులకు భయం ఎలా వస్తుంది? ప్రజల సొమ్మును కాపాడాల్సిన అధికారులు.. అదే ప్రజల సొమ్మును దోచుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటూ కూడా సంవత్సరాల పాటు కేసులు నడుస్తుంటే, అసలు వ్యవస్థలో భయం ఎక్కడ? ప్రభుత్వ ఉద్యోగం అంటే ప్రజల నమ్మకానికి ప్రతీక. ప్రజల పన్నులతో వచ్చే డబ్బు, అభివృద్ధి పనులకు కేటాయించే నిధులు, పేదల సంక్షేమానికి విడుదల చేసే కోట్ల రూపాయలు ప్రజల సొమ్ము. ఆ సొమ్ముకు కాపలాదారులుగా ఉండాల్సిన వారు అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు రావడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదకరం. తాజాగా ప్రచారంలో ఉన్న ఒక పట్టికలో పలువురు అధికారుల పేర్లు, వారి వద్ద ఉన్నట్లు పేర్కొన్న ఆస్తుల వివరాలు, వాటి విలువలను చూపిస్తూ రూ.4,320 కోట్ల మొత్తం ప్రస్తావించబడింది. ఈ వివరాలు అధికారికంగా ధృవీకరించాల్సినవే. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సమాచారం ఆధారంగా ఎవరినీ దోషిగా ప్రకటించలేం. కానీ ఇలాంటి భారీ ఆస్తుల వివరాలు ప్రచారంలోకి వస్తే వాటి మూలాలు ఏమిటి? ఆదాయానికి మించి ఆస్తులు ఎలా వచ్చాయి? బినామీ ఆస్తులు ఉన్నాయా? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సిందే.

**ఏసీబీ దాడి.. అరెస్ట్.. సస్పెన్షన్.. ఆ తర్వాత?**

అవినీతి కేసులో ఒక అధికారి పట్టుబడితే ఏసీబీ కేసు నమోదు చేస్తుంది. అరెస్టు జరుగుతుంది. సస్పెన్షన్ వేటు పడుతుంది. కొంతకాలం వార్తల్లో హడావుడి ఉంటుంది. కానీ ఆ తర్వాత దర్యాప్తు నెమ్మదిస్తే? కేసు సంవత్సరాల తరబడి కొనసాగితే? తుది తీర్పు ఆలస్యమైతే?

**ఇదే ప్రజల అసలు ప్రశ్న.**

"అవినీతి చేస్తే కొంతకాలం సస్పెన్షన్.. తర్వాత మళ్లీ విధుల్లోకి" అనే నమ్మకం ఏర్పడితే, అవినీతికి అడ్డుకట్ట ఎలా పడుతుంది? సస్పెన్షన్‌తో భయం రాదు.. తుది చర్యతోనే భయం వస్తుంది! సస్పెన్షన్ సాధారణంగా తుది శిక్ష కాదు. అది దర్యాప్తు లేదా క్రమశిక్షణ చర్యల్లో భాగం. సస్పెన్షన్ సమయంలో లభించే సబ్‌సిస్టెన్స్ అలవెన్స్ కూడా సంబంధిత నిబంధనల ఆధారంగా ఉంటుంది. కాబట్టి ప్రతి సస్పెండ్ ఉద్యోగికి తప్పనిసరిగా 75 శాతం జీతం వస్తుందని చెప్పడం సరైంది కాదు. కానీ ప్రజల ప్రశ్న మాత్రం మరింత ఘాటుగా ఉంది. కేసు నమోదైంది.. సస్పెన్షన్ వచ్చింది.. దర్యాప్తు సంవత్సరాల తరబడి సాగింది.. ఈలోపు చట్టబద్ధమైన భృతి లభించింది.. చివరికి మళ్లీ ఉద్యోగంలోకి వచ్చే అవకాశం ఉంటే అవినీతి చేయడానికి భయం ఎక్కడి నుంచి వస్తుంది?

**దోచుకో.. పట్టుబడు.. పంచుకో..**

**రెండేళ్లు ఆగు.. మళ్లీ రా" అనే పరిస్థితి రావద్దు!**

అవినీతి వ్యవస్థలో సాధారణమైపోతే నిజాయితీగా పనిచేసే ఉద్యోగుల ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం తగ్గుతుంది. అవినీతికి పాల్పడేవారికి మరింత ధైర్యం వస్తుంది. అందుకే ఏసీబీ కేసు నమోదవడం ఒక ప్రారంభం మాత్రమే. దర్యాప్తు వేగంగా పూర్తవ్వాలి. అక్రమ ఆస్తుల మూలాలను పరిశీలించాలి. బినామీ ఆస్తులను గుర్తించాలి. బ్యాంకు లావాదేవీలను పరిశీలించాలి. అక్రమ సంపాదనకు ఆధారాలు లభిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. దోషిగా తేలితే కఠినమైన శిక్ష పడాలి. అదే సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి కూడా చట్టపరమైన హక్కులు ఉంటాయి. ఆరోపణ వచ్చినంత మాత్రాన ఎవరినీ దోషిగా ప్రకటించకూడదు. నిర్దోషి అయితే న్యాయం జరగాలి.. దోషి అయితే చట్టం ముందు ఎవరూ తప్పించుకోకూడదు.

**ప్రజాధనానికి కాపలాదారులా? లేక అక్రమ సంపాదనకు మార్గదర్శకులా?**

ఒక అధికారి సంతకం వెనుక ఒక కుటుంబం భవిష్యత్తు ఉంటుంది. ఒక టెండర్ వెనుక కోట్ల రూపాయల ప్రజాధనం ఉంటుంది. ఒక సంక్షేమ పథకం వెనుక పేద కుటుంబాల ఆశ ఉంటుంది. ఒక రోడ్డు నిర్మాణం వెనుక ప్రజల ప్రాణ భద్రత ఉంటుంది. అలాంటి అధికారాన్ని వ్యక్తిగత సంపాదనకు ఉపయోగిస్తే అది కేవలం అవినీతి కాదు ప్రజల నమ్మకానికి ద్రోహం. ప్రజలు కోరేది ప్రతీకారం కాదు. రాజకీయ కక్ష కాదు. ఆధారాలు లేకుండా ఎవరినీ దోషులుగా ప్రకటించడం కాదు. ప్రజల కోరేది ఒక్కటే పారదర్శకమైన దర్యాప్తు.. వేగవంతమైన విచారణ.. నిష్పక్షపాతమైన నిర్ణయం.. దోషి అయితే కఠినమైన శిక్ష.. నిర్దోషి అయితే గౌరవప్రదమైన విముక్తి.

**అసలు ప్రశ్న ఇదే!.**

"ఏసీబీ కేసుకు భయపడని అవినీతిపరుడికి.. చట్టం అంటే భయం ఎప్పుడు వస్తుంది?" "సస్పెన్షన్‌కు భయపడని అధికారికి.. తుది శిక్ష భయం ఎప్పుడు వస్తుంది?" "ప్రజల సొమ్మును దోచుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులు ఎప్పటికి తేలుతాయి?"

**అవినీతికి సస్పెన్షన్ సరిపోదు..చట్టబద్ధమైన తుది చర్యే అసలైన సమాధానం!**

**ప్రజల సొమ్ము – ప్రజల కోసమే!**

అవినీతిపరుల అక్రమ సంపాదన కోసం కాదు! ప్రజా సేవ కోసం ప్రభుత్వ వ్యవస్థలను కాపాడడం కోసం పనిచేయడం నేర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు దిగజారి పోవడానికి బలమైన కారణం అవినీతిపరులేనని హెచ్చరించారు. నిజాయితీగా పని చేస్తున్న అధికారులు కూడా అవినీతిపరుల తాకిడిని తట్టుకోలేకపోతున్నారని గుర్తు చేశారు రాష్ట్ర ప్రభుత్వం అవినీతిపరుల పట్ల చర్యలు తీసుకుంటున్నట్లు కఠినత్వాన్ని ప్రదర్శిస్తూనే స్వల్ప కాలంలో ఉద్యోగాల్లోనికి తీసుకుంటున్నారని దానివల్ల అవినీతిపరుల జబర్దస్త్ కాస్త హద్దులు లేకుండా సాగుతుందని సూటిగా నిలదీశారు. ప్రజల సొమ్మును పక్కదారి పట్టిస్తూ అవినీతికి పాల్పడుతున్న అవినీతిపరులను ఉద్యోగాల్లోకెల్లి శాశ్వతంగా తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**వంద కోట్లకుపైగా ఆస్తులు కూడబెట్టిన ఆఫీసర్లు వీళ్లే**

| అధికారి | హోదా | ఆస్తులు (రూ. కోట్లలో) |
|---|---|---|
| హరిరాం | ఈఎన్సీ (కాళేశ్వరం) | 200 |
| నూనె శ్రీధర్ | ఈఈ (కాళేశ్వరం) | 150 |
| మురళీధర్ రావు | మాజీ ఈఎన్సీ (కాళేశ్వరం) | 100 |
| ముత్యం వెంకటరమణ | డీఈ, రెడ్కో | 400 |
| రవీందర్ | చీఫ్ ఇంజినీర్, హెచ్ఎండీఏ | 90 |
| సంకిరెడ్డి భీమారెడ్డి | డీఎస్పీ | 300 |
| సుంకరి నరహరి రావు | ల్యాండ్స్, సర్వే డీడీ | 150 |
| మోహన్ నాయక్ | ఈఎన్సీ, ఆర్ అండ్ బీ | 200 |
| ఆనంద్ కుమార్ | ఈఎన్సీ (కాళేశ్వరం పవర్) | 320 |
| సుధాకర్ రెడ్డి | సీఈ ఇరిగేషన్ | 270 |
| వెంకటేశ్వర్లు | ఎస్ఈ, ఇరిగేషన్ | 230 |
| శ్రీనివాసరావు | ఈఈ (ఇరిగేషన్) | 180 |
| అనంత లక్ష్మీకుమార్ | జీఎం( వాటర్ బోర్డ్) | 100 |
| మూడ్ కిషన్ | డీటీసీ( రవాణా) | 100 |
| బాలకృష్ణ ఎస్ | మాజీ డైరెక్టర్ (టౌన్ ప్లానింగ్) | 250 |
| ఆకుల జగదీశ్వర్ రెడ్డి | సీఈ (ట్రైబల్ వెల్ఫేర్) | 120 |
| జ్యోతి | కమిషనర్ (బండ్లగూడ) | 100 |
| కనకరాజు | డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ | 130 |
| రమేశ్ కుమార్ | జేడీ, వాణిజ్య పన్నులు | 150 |
| హరి భూషణ్ | ఈఈ ఆర్ & బీ | 110 |
| డీ సత్యనారాయణరావు | ఆర్టీవో, ఖమ్మం, వరంగల్ | 105 |
| వీ దేవేందర్ రెడ్డి | సీపీవో, మేడ్చల్ | 115 |
| పీ రాధాకృష్ణ | సబ్ రిజిస్ట్రార్, మేడ్చల్ | 160 |
| బీ విఠల్ | ఎస్ఈ | 140 |
| లక్ష్మీనారాయణ | అడిషనల్ కలెక్టర్ | 150 |
| | మొత్తం | 4,320 |

# మొబైల్‌కు బానిసలవుతున్న యువతపై డా. మేడపాటి ఆవేదన

**ప్రయాణ సమయంలో ఫోన్ వినియోగం ప్రాణాలకే ముప్పు: భద్రతా నియమాలు పాటించాలని సూచన**

**అమరావతి, 23 జూలై 2026(జై భీమ్ న్యూస్)**



సామాజిక శాస్త్రవేత,కవి, రచయిత, డా. మేడపాటి ఇమ్మానుయేల్ .

యువత ఒక్క క్షణం కూడా మొబైల్ ఫోన్‌ను విడిచి ఉండలేని స్థితికి చేరుకోవడం ఆందోళనకరమని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త, కవి, రచయిత డా. మేడపాటి ఇమ్మానుయేల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడంలో తప్పులేదని, అయితే దాని దుర్వినియోగం వ్యక్తిగత జీవితం, కుటుంబ సంబంధాలు, ప్రజల భద్రతపై ప్రతికూల ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. ప్రస్తుత తరంలో మొబైల్ వినియోగం విపరీతంగా పెరిగిపోయిందని ఆయన అన్నారు. విద్యావంతులైన యువత నుంచి వృద్ధుల వరకు చాలామంది మొబైల్ ఫోన్ మోగగానే తాము ఎక్కడ ఉన్నారనే విషయాన్ని కూడా మరిచిపోతున్నారని విమర్శించారు. ముఖ్యంగా వాహనాలు నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ మాట్లాడటం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. ఒక చేతిలో మొబైల్ ఫోన్‌ను చెవికి పెట్టుకుని, మరో చేతితో ద్విచక్ర వాహనం నడపడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయని తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం కంటే ఆధునికతను ప్రదర్శించడానికే కొందరు ప్రాధాన్యం ఇస్తున్నారని, ఇలాంటి నిర్లక్ష్య వైఖరి నిండు ప్రాణాలను బలితీసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది సంవత్సరాల పాటు మొబైల్ ఫోన్లు, ఆధునిక సాంకేతికత లేకుండానే మానవ సమాజం ప్రశాంతంగా జీవించిందని డా. మేడపాటి గుర్తుచేశారు. అయితే నేడు కొద్దిసేపు ఫోన్ చేతిలో లేకపోయినా ఏదో కోల్పోయినట్లుగా ఆందోళన చెందుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. సోషల్ మీడియా, రీల్స్, చాటింగ్‌కు యువత అధిక సమయం కేటాయిస్తూ నిద్రను సైతం నిర్లక్ష్యం చేయడం కుటుంబ సంబంధాలపై ప్రభావం చూపుతోందని అన్నారు. ఒకప్పుడు ఇంట్లో ఒక్క ల్యాండ్‌లైన్ ఫోన్ ఉన్న రోజుల్లో కుటుంబ సభ్యుల మధ్య సంభాషణలు, అనుబంధాలకు ఎంతో ప్రాధాన్యం ఉండేదని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండటంతో సాంకేతిక సౌకర్యాలు పెరిగినప్పటికీ, మానవ సంబంధాల్లో దూరం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. టెక్నాలజీ మనిషి జీవనాన్ని సులభతరం చేయడానికే తప్ప, ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడానికి కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రయాణ సమయంలో మొబైల్ వినియోగాన్ని పూర్తిగా పక్కనపెట్టి, ప్రాణ భద్రతకు, కుటుంబ సంక్షేమానికి ప్రతి ఒక్కరూ అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని డా. మేడపాటి ఇమ్మానుయేల్ సూచించారు.

# యువతను సనాతన ధర్మ పరిరక్షణలో భాగస్వాములను చేయాలి

**తెలంగాణ ఆర్య ప్రతినిధి సభ ప్రధాన్ విఠల్‌రావు ఆర్య**

**హసన్‌పర్తి, 23 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**





సత్య సనాతన వైదిక ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత యువతపై ఉందని తెలంగాణ ఆర్య ప్రతినిధి సభ ప్రధాన్ విఠల్‌రావు ఆర్య అన్నారు. హసన్‌పర్తి బస్టాండ్ సమీపంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆర్య సమాజ భవనాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. హసన్‌పర్తి ఆర్య సమాజం అధ్యక్షుడు పోలం రవీందర్, కార్యదర్శి శీలం వెంకటస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా పరకాల ఆర్య సమాజం ప్రధాన్ దేవరకొండ దత్తాత్రేయ ఆర్య ఓం జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ ఆర్య ప్రతినిధి సభ ప్రధాన్ విఠల్‌రావు ఆర్య, తెలంగాణ ఆర్య ప్రతినిధి సభ మంత్రి హరికిషన్ వేదాలంకార్ తదితరులు శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి నూతన ఆర్య సమాజ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం విఠల్‌రావు ఆర్య మాట్లాడుతూ సమసమాజ నిర్మాణంలో ఆర్య సమాజం ప్రతినిధుల పాత్ర కీలకమన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానవుడు యాంత్రిక జీవనానికి అలవాటు పడుతూ సంస్కృతి, సంప్రదాయాలను విస్మరిస్తున్నారని తెలిపారు. దీంతో అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. యోగా, యజ్ఞం, వేద పఠనం ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, సనాతన ధర్మంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్య సమాజంలో సభ్యుల సంఖ్యను పెంచడంతో పాటు సనాతన ధర్మ పరిరక్షణలో యువతను భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్య సమాజ భవన నిర్మాణానికి సహకరించిన దాతలను, నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన వారిని ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్య సమాజ ప్రతినిధి యజ్ఞ బ్రహ్మ విశ్వశ్రవ, పండిత జ్యోతి, శీలం సత్యవ్రత్, హసన్‌పర్తి ఆర్య సమాజ గౌరవ అధ్యక్షుడు వెలగందుల ఆనందం, ఉప ప్రధాన్ తోపెల రమేష్, ఉప మంత్రి ఆమంచ కనకవ్రత్, కోశాధికారి ఆమంచ భరత్‌కుమార్, సభ్యులు మసురం సవిత, గౌరిశెట్టి భాస్కర్, బోనాల అనిల్‌కుమార్, కాలె రమేష్, గోపరాజు సారయ్య, ఆమంచ అజిత్‌కుమార్, గడ్డం రవీందర్, సంజీవ్, చంద్రమోహన్, శివకుమార్, పృథ్వీరాజ్ గుప్త, యాదగిరి, గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బల్దియాలో నిబంధనకు తూట్లు.. ఆర్ఐలదే రాజ్యం..!?

**గ్రేటర్ వరంగల్‌లో ఒకే చోట ఆరేళ్లుగా తిష్ట..**
**ఫైళ్ల జాప్యం, అవినీతి ఆరోపణలపై ఉన్నతాధికారుల మౌనం...!**

**వరంగల్, 23 ఆగస్ట్ 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కొందరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐ)లు వ్యవహరిస్తున్న తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకే డిపార్ట్‌మెంట్‌లో మూడేళ్లకు మించి పనిచేయకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ.. కొందరు ఆర్ఐలు నాలుగేళ్లు, ఏకంగా ఆరేళ్ల వరకు కూడా ఒకే చోట తిష్ట వేసి కొనసాగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. "మాదే రాజ్యం.. మేమే రాజులం.. మమ్మల్ని ఎవరు కదల్చలేరు" అన్న ధీమాతో కొందరు ఆర్ఐ లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం బదిలీ కావాల్సిన ఉద్యోగులు ఇంతకాలం ఒకే చోట కొనసాగడానికి కారణం ఏమిటన్నది ఉన్నతాధికారులే స్పష్టం చేయాల్సి ఉంది.

**ఏళ్ల తరబడి ఒకే చోట**

ఒకే ప్రాంతంలో ఎక్కువకాలం పనిచేయడం వల్ల స్థానికంగా పరిచయాలు, ప్రభావం పెరగడం సహజం. అలాంటి పరిస్థితుల్లో బదిలీల విధానం ఎందుకు అమలు కావడం లేదనే దానిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**ఫైళ్ల కదలికను పరిశీలిస్తే అసలు విషయం బయటపడే అవకాశం**

ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న ఆర్ఐల పనితీరుపై సమగ్ర పరిశీలన నిర్వహిస్తే మరిన్ని అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. వారి పరిధిలోకి వచ్చిన ఫైళ్లలో ఎన్ని నిర్ణీత సమయంలో పరిష్కరించారు, ఎన్ని నెలల తరబడి పెండింగ్‌లో ఉంచారు, ఎన్ని ఫైళ్లను తిరస్కరించారు, తిరస్కరించిన ఫైళ్లలో మళ్లీ ఎన్ని ఆమోదించారు, ఆ నిర్ణయాలకు కారణాలు ఏమిటి అనే వివరాలను పరిశీలించాల్సి ఉంది. ఫైళ్ల కదలికపై తేదీల వారీగా పరిశీలన, పెండింగ్ ఫైళ్లపై కారణాల ఆరా, క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తే ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులకు అసలు కారణాలు బయటపడే అవకాశం ఉంది.




**"చేతులు తడుపుతేనే పని త్వరగా.. లేకపోతే ఆలస్యం"**

కొంతమంది ఆర్ఐలు కాసులు ఇస్తే పనులు త్వరగా చేస్తారని, ఇవ్వకపోతే ఫైళ్లను ఆలస్యం చేస్తారనే ఆరోపణలు ఉన్నాయి.

**డిజిటల్ చెల్లింపులపై ఆరోపణలు**

కొంతమంది ఆర్ఐలు నేరుగా కాసులు తీసుకోవడం , కొంతమంది తీసుకోకుండా బంధువులు, పరిచయస్తుల ఖాతాలకు ఫోన్‌పే, గూగుల్‌పే వంటి డిజిటల్ చెల్లింపుల ద్వారా డబ్బులు పంపించుకుంటున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మరికొందరు మధ్యవర్తులను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నారనే ప్రచారం ఉంది. ఈ ఆరోపణలపై ఫిర్యాదులు వస్తే నిబంధనల ప్రకారం విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. అలాగే ఆర్ఐగా పనిచేయడానికి అవసరమైన అర్హతలు, ఒకే పోస్టులో కొనసాగేందుకు ఉన్న నిబంధనలు, మూడేళ్లకు మించి కొనసాగిన వారికి ఎవరి అనుమతి ఉంది అనే వివరాలను కూడా కార్పొరేషన్ స్పష్టంగా వెల్లడించాలి,

**కమిషనర్ తీసుకునే చర్యలపైనే ఇప్పుడు అందరి దృష్టి**

ఒకే చోట ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఆర్ఐలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బదిలీలు చేపట్టడంతో పాటు ఆరోపణలపై ఆధారాలు లభించిన సందర్భంలో శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, ఆదాయాలకు నుంచి ఆస్తుల పైన కూడా క్షేత్రస్థాయి విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

**కాజీపేట సర్కిల్‌లో వ్యక్తిగత వ్యవహారంపై ప్రచారం**

కాజీపేట సర్కిల్‌లో ఓ ఆర్ఐ విధులను సక్రమంగా నిర్వహించకుండా అనేక ఫైళ్లను పెండింగ్లో పెట్టి తన వ్యక్తిగత లీలలలో నిమగ్నము అయినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం లోనూ ప్రత్యేక దృష్టిలో సారించి విచారణ చేపడితే విస్తుపోయే లీలలు వెలుగు చూసే అవకాశం ఉంది అని కార్యాలయములో గుసగుసలు వినిపిస్తున్నాయి.


# నూతన బాధ్యతపై భీమ వినయ్ కుమార్ కృతజ్ఞతలు

**హనుమకొండ, 23 ఆగస్ట్ 2026 (జై భీమ్ న్యూస్)**




కాంగ్రెస్ పార్టీ 9వ డివిజన్ నూతన అధ్యక్షుడిగా తనను నియమించిన పార్టీ నాయకులకు భీమ వినయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామిరెడ్డి, టీపీసీసీ సభ్యులు బట్టు శ్రీను, ఈవీ శ్రీను, మాజీ కార్పొరేటర్లు పుప్పాల ప్రభాకర్, చీకటి శారదా ఆనంద్, 9వ డివిజన్ ఇన్‌చార్జీలు అలువాల కార్తిక్, ఎం.డి. జాఫర్తో పాటు డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలందరికీ తన తరఫున పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ 9వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని భీమ వినయ్ కుమార్ పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ డివిజన్ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ చైర్మన్ సాయి రమేష్





**వరంగల్, 23 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

చారిత్రక వరంగల్ నగరంలోని శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ చైర్మన్ సాయి రమేష్ ఆదివారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆయనతో పాటు సౌత్ ఇండియా చైర్మన్ నరేష్, నేషనల్ అబ్జర్వర్ డాక్టర్ రాధాకృష్ణ, వరంగల్ జిల్లా చైర్మన్ సూరజ్ గౌడ్, కృష్ణమూర్తి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ప్రతినిధులకు ఆలయ వర్గాలు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా దేశ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఆనందం వెల్లివిరియాలని వారు అమ్మవారిని ప్రార్థించారు. అదేవిధంగా దేశంలో శాంతి, సామరస్యం మరింత బలపడాలని, ప్రజల మధ్య పరస్పర గౌరవం, సోదరభావం పెంపొందాలని కోరుకున్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ న్యాయం, భద్రత, హక్కుల పరిరక్షణ కలగాలని అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. దర్శనం అనంతరం నాయకులు కొద్దిసేపు ఆలయ ప్రాంగణంలో గడిపారు. ఈ సందర్భంగా శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయ చారిత్రక నేపథ్యం, ఆధ్యాత్మిక విశిష్టత, వరంగల్ నగరంతో ఆలయానికి ఉన్న అనుబంధం గురించి వారు చర్చించారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన భద్రకాళి ఆలయం తెలంగాణలోనే కాకుండా దేశవ్యాప్తంగా ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా గుర్తింపు పొందిందని వారు పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, హక్కుల పరిరక్షణ, వినియోగదారుల అవగాహన వంటి అంశాలపై కూడా ఈ సందర్భంగా నాయకులు పరస్పరం చర్చించినట్లు తెలిపారు. వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, తమకు ఎదురయ్యే సమస్యలపై చట్టపరమైన మార్గాల్లో పరిష్కారం పొందేందుకు ముందుకు రావాలని సూచించారు. భద్రకాళి అమ్మవారి దర్శనం తమకు ఆధ్యాత్మిక ప్రశాంతతను కలిగించిందని నాయకులు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, సమాజ అభివృద్ధి కోసం మరింత బాధ్యతతో పనిచేయాలని అమ్మవారి ఆశీస్సులు కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్‌కు చెందిన పలువురు ప్రతినిధులు డా. నరేష్, మెరుగు రాధాకృష్ణ, మౌనిక, అనిల్ కాందారి, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడింది.

# సైబర్‌వాల్‌నెట్‌తో కిట్స్ వరంగల్ ఎంఓయూ

## పరిశ్రమ-విద్యాసంస్థల సహకారంతో విద్యార్థులకు సైబర్‌సెక్యూరిటీ నైపుణ్యాలు



**వరంగల్, 23 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్ వరంగల్)లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్--నెట్‌వర్క్స్ (సీఎస్ఈ --నెటవర్క్స్) విభాగం, హైదరాబాద్‌కు చెందిన సైబర్‌వాల్‌నెట్ ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. పరిశ్రమ--విద్యాసంస్థల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు పరిశ్రమ ఆధారిత సైబర్‌సెక్యూరిటీ విద్య, ఆచరణాత్మక శిక్షణ, పరిశోధన అవకాశాలను అందించడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశ్యమని కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి తెలిపారు. ఆగస్టు 22, 2026న కిట్స్ వరంగల్ కమిటీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి, సైబర్‌వాల్‌నెట్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీ ప్రసాద్ పాలేపు పరస్పరం ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా సైబర్‌వాల్‌నెట్ వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీ ప్రసాద్ పాలేపు మాట్లాడుతూ.. సైబర్‌సెక్యూరిటీ రంగంలో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు తమ సంస్థతో కిట్స్ వరంగల్ కలిసి పనిచేయడం ఎంతో ప్రయోజనకరమని అన్నారు. సైబర్‌వాల్‌నెట్ సైబర్‌సెక్యూరిటీ ప్లాట్‌ఫామ్, ప్రయోగశాలలు, పరిశ్రమ ఆధారిత ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులు, ఉమ్మడి పరిశోధన, ఆవిష్కరణలు, ఆర్అండ్‌డీ కార్యకలాపాల ద్వారా విద్యార్థులను పరిశ్రమకు సిద్ధం చేయడమే లక్ష్యమని వివరించారు. అలాగే ప్రభుత్వ, సంస్థాగత నిధుల పథకాల కింద అందుబాటులో ఉన్న అవకాశాలను అన్వేషించడంతో పాటు భవిష్యత్‌లో ఉమ్మడి పరిశోధన కార్యక్రమాలను చేపట్టేందుకు ఈ ఎంఓయూ దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులకు ప్రత్యక్షంగా పరిశ్రమ అనుభవాన్ని అందించడం ద్వారా సైబర్‌సెక్యూరిటీ రంగంలో అవసరమైన ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి భాగస్వామ్యాలు ఎంతో కీలకమన్నారు. ఈ ఎంఓయూ ద్వారా విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సాంకేతిక నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం, ఆవిష్కరణలపై ఆసక్తి పెంపొందుతాయని తెలిపారు. కిట్స్ వరంగల్ బీటెక్ పాఠ్యప్రణాళికకు ఈ చొరవ మరింత బలాన్ని చేకూర్చడంతో పాటు విద్యార్థులను పరిశ్రమకు సిద్ధమైన టి-ఆకారపు నైపుణ్యాలు కలిగిన అభ్యాసకులుగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. సైబర్‌వాల్‌నెట్ సంస్థతో ఈ భాగస్వామ్యాన్ని కుదుర్చుకోవడంపై ఆయన సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిట్స్ వరంగల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, సీఎస్ఈ--నెట్‌వర్క్స్ విభాగాధిపతి డాక్టర్ ఎస్. వెంకట్రాములు, ఐ3సీ ఇన్‌చార్జి ప్రొఫెసర్ ఎం. వీర రెడ్డి, డాక్టర్ వి. చంద్రశేఖర్ రావు, ప్రొఫెసర్ వి. శంకర్, టీపీఓ డాక్టర్ టి. చంద్రబాయి, కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్, పీఆర్వో డాక్టర్ డి. ప్రభాకరాచారి, డాక్టర్ జి. సునీల్ కుమార్‌తో పాటు డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గే వద్ద కొండా సురేఖ పంచాయితీ!

**ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో మంత్రి కొండా సురేఖ భేటీ?**
**తనపై కుట్ర జరుగుతోందని ఖర్గేకు వివరించిన సురేఖ**
**సీఎం, పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడొద్దని సురేఖకు ఖర్గే హితవు**

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వద్దకు చేరింది. ఆదివారం బెంగళూరులో ఖర్గేతో మంత్రి సురేఖ సమావేశమైనట్టు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి రావడానికి ఒక్కరోజు ముందు ఈ భేటీ జరగడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీలో అంతర్గతంగా ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో సురేఖ నేరుగా అధిష్ఠానాన్ని కలవడం చర్చనీయాంశమైంది. సుమారు 15 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో కొండా సురేఖ తన వాదనను ఖర్గే ముందు వినిపించినట్లు సమాచారం. తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గానీ, కాంగ్రెస్ పార్టీకి గానీ, గాంధీ కుటుంబానికి గానీ వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని ఆమె వివరించారు. పార్టీలోని కొందరు నేతలు తనను లక్ష్యంగా చేసుకుని, మంత్రివర్గం నుంచి తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని, దీనిపై విచారణ చేపట్టాలని ఆమె ఖర్గేను కోరినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఖర్గే స్పందిస్తూ.. పార్టీకి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా మాట్లాడటం సరైన పద్ధతి కాదని సురేఖకు స్పష్టం చేసినట్లు సమాచారం. టికెట్ల కేటాయింపు, అభ్యర్థుల ఎంపిక పూర్తిగా ఏఐసీసీ ఎన్నికల కమిటీ పరిధిలోని అంశమని, వాటిపై ఏకపక్ష ప్రకటనలు చేయకూడదని ఆయన హితవు పలికినట్లు తెలిసింది. కొండా సురేఖ కుమార్తె సుస్మిత.. సీఎం రేవంత్ రెడ్డి, పరకాల టికెట్‌పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పీసీసీ క్రమశిక్షణ సంఘం నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సురేఖ, ఆమె కుమార్తెపై కఠిన చర్యలు తీసుకోవాలని 20 మందికి పైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసే ప్రయత్నాలు ఫలించకపోవడంతోనే ఆమె నేరుగా ఖర్గేను కలిసినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem

# డయల్ యువర్ ఎమ్మెల్యే కాల్‌కు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు

మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతుల నేపథ్యంలో కాలనీ వాసులకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



**వర్ధన్నపేట, 23 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటూ, డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదుపై వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్. నాగరాజు వెంటనే స్పందించారు. నియోజకవర్గంలోని 65వ డివిజన్ ఎల్లాపూర్, దేవన్నపేటతో పాటు పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్‌ల మరమ్మతులు కొనసాగుతున్న నేపథ్యంలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ సమస్యపై గ్రామ ప్రజలు డయల్ యువర్ ఎమ్మెల్యే నంబర్‌కు ఫోన్ చేయగా, ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఆయా ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్లను పంపించారు. మిషన్ భగీరథ పైపులైన్‌ల మరమ్మతులు పూర్తయ్యే వరకు ఆయా గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నిరంతరంగా నీటిని సరఫరా చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను డయల్ యువర్ ఎమ్మెల్యే నంబర్‌కు తెలియజేసి, సమస్యల పరిష్కారానికి ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు కోరారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# ప్రమాద బాధితుడికి ల్యాబ్ అసోసియేషన్ మానవతా సాయం

ల్యాబ్ సభ్యుడికి ఆపన్నహస్తం.. రూ.20 వేల ఆర్థిక సాయం




**హసనపర్తి, 23 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ప్రమాదంలో కుడి కాలు కోల్పోయిన ల్యాబ్ అసోసియేషన్ సభ్యుడు కొయ్యడ నాగరాజుకు హసనపర్తి మండల ల్యాబ్ అసోసియేషన్ సభ్యులు మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. జనగామ జిల్లా తరిగొప్పుల మండలానికి చెందిన కొయ్యడ నాగరాజు హసనపర్తి మండల ల్యాబ్ అసోసియేషన్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన కుడి కాలును కోల్పోయారు. ఈ విషయం తెలుసుకున్న హసనపర్తి మండల ల్యాబ్ అసోసియేషన్ ప్రతినిధులు నాగరాజు కుటుంబాన్ని పరామర్శించి, ఆయన పరిస్థితిని తెలుసుకున్నారు. కష్టకాలంలో తమ సంఘం సభ్యుడికి అండగా నిలవాలనే ఉద్దేశంతో అసోసియేషన్ తరఫున రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో హసనపర్తి మండల ల్యాబ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. కుమార్, ఉపాధ్యక్షుడు ఎం. రాజుకుమార్, ప్రధాన కార్యదర్శి ఎం. అశోక్, కోశాధికారి ఈ. పెద్దిరెడ్డి, సభ్యులు జపాల్, రమేష్ తదితరులు పాల్గొని నాగరాజుకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, తమ సంఘ సభ్యులు ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు వారికి అండగా నిలిచి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. ప్రమాదంలో కాలు కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న నాగరాజుకు తమ వంతు సహాయంగా రూ.20 వేల ఆర్థిక సాయం అందించినట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ఆపద సమయంలో తోడుగా నిలిచిన హసనపర్తి మండల ల్యాబ్ అసోసియేషన్ సభ్యుల మానవతా దృక్పథాన్ని పలువురు అభినందించారు.

# తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ.. సర్వదర్శనానికి 8 గంటలే!

తిరుమలలో సాధారణ రద్దీ

22 కంపార్ట్‌మెంట్లలో వేచి చూస్తున్న భక్తులు

శనివారం శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.67 కోట్లు

నిన్న స్వామివారిని దర్శించుకున్న 84 వేల మంది భక్తులు

తిరుమల :తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ గణనీయంగా తగ్గింది. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు స్వామివారి దర్శనానికి కేవలం 8 గంటల సమయం పడుతోంది. ప్రస్తుతం 22 కంపార్ట్‌మెంట్‌లలో మాత్రమే భక్తులు శ్రీవారి దర్శనం కోసం వేచి ఉండటంతో కొండపై రద్దీ సాధారణ స్థితికి చేరుకుంది. నిన్న శనివారం (ఆగస్టు 22) శ్రీవారిని దర్శించుకున్న భక్తుల వివరాలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. నిన్న ఒక్కరోజే మొత్తం 84,873 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 36,286 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం శ్రీవారి హుండీ ద్వారా రూ. 3.67 కోట్ల కానుకలు లభించినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా, టీటీడీ 4.38 లక్షల లడ్డూ ప్రసాదాలను విక్రయించగా, 2.42 లక్షల మందికి అన్నప్రసాదం అందించింది. తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో 3,523 మందికి వైద్య సేవలు అందించినట్లు టీటీడీ పేర్కొంది.

# స్వర్ణగిరి ఆలయంలో భరతనాట్యంతో అలరించిన చిన్నారి ఆధ్యశ్రీ కుంబాల


**మంచిర్యాల, 23 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

స్వర్ణగిరిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మంచిర్యాలకు చెందిన చిన్నారి ఆధ్యశ్రీ కుంబాల తన అద్భుతమైన భరతనాట్య ప్రదర్శనతో భక్తులను, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలో భక్తి భావంతో సాగిన కార్యక్రమంలో చిన్నారి ప్రదర్శించిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంచిర్యాలకు చెందిన కుంబాల అనిత శ్రీధర్ దంపతుల ముద్దుల కుమార్తె అయిన ఆధ్యశ్రీ కుంబాల ప్రస్తుతం మంచిర్యాలలోని అల్ఫోర్స్ స్మార్ట్ స్కూల్‌లో ఐదవ తరగతి చదువుతోంది. చిన్ననాటి నుంచే నృత్యంపై ఆసక్తి పెంచుకున్న ఆధ్యశ్రీ భరతనాట్యంలో శిక్షణ పొందుతూ తన ప్రతిభను వివిధ వేదికలపై ప్రదర్శిస్తోంది. స్నేహ ఫౌండేషన్, మంచిర్యాల ఆధ్వర్యంలో కే.వి. చిదానందకుమారి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆధ్యశ్రీకి భరతనాట్య ప్రదర్శనకు అవకాశం లభించింది. స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పవిత్ర ప్రాంగణంలో భక్తుల సమక్షంలో ఆమె ప్రదర్శించిన భరతనాట్యం అందరినీ ఆకట్టుకుంది. తాళానికి అనుగుణంగా చేసిన నృత్య విన్యాసాలు, చక్కటి నృత్య భంగిమలు, హావభావాలు, కాలి కదలికలు, ఆత్మవిశ్వాసంతో చేసిన ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. చిన్నారి వయసును మించి ఏకాగ్రతతో, నైపుణ్యంతో భరతనాట్యాన్ని ప్రదర్శించడంతో అక్కడ ఉన్న భక్తులు, ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించి చప్పట్లతో అభినందించారు. ప్రదర్శన అనంతరం పలువురు ఆధ్యశ్రీని అభినందిస్తూ ఆశీర్వదించారు. చిన్న వయసులోనే విద్యాభ్యాసంతో పాటు భారతీయ సాంప్రదాయ కళ అయిన భరతనాట్యాన్ని అభ్యసిస్తూ ప్రతిభను చాటుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. భరతనాట్యం భారతీయ సంస్కృతి, సంప్రదాయం, భక్తి భావాలను ప్రతిబింబించే గొప్ప కళారూపమని, ఇలాంటి కళలను చిన్నారులు నేర్చుకోవడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు మరింత చేరువవుతాయని అన్నారు. చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారికి తగిన వేదికలు కల్పించడం ద్వారా వారు తమ నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆధ్యశ్రీకి తల్లిదండ్రులు కుంబాల అనిత శ్రీధర్ అందిస్తున్న ప్రోత్సాహాన్ని పలువురు ప్రశంసించారు. చదువుతో పాటు నృత్యకళపై ఆసక్తిని పెంపొందిస్తూ చిన్నారి ప్రతిభను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. అదే విధంగా స్నేహ ఫౌండేషన్, మంచిర్యాల ఆధ్వర్యంలో చిన్నారులలోని ప్రతిభను వెలికితీసేందుకు, భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు చేస్తున్న కృషిని పలువురు అభినందించారు. స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పవిత్ర ప్రాంగణంలో భరతనాట్యంతో భక్తులను, ప్రేక్షకులను అలరించిన చిన్నారి ఆధ్యశ్రీ కుంబాల భవిష్యత్తులో మరిన్ని ఉన్నత వేదికలపై తన ప్రతిభను ప్రదర్శించి మంచి గుర్తింపు పొందాలని పలువురు ఆకాంక్షించారు.



# నేడు ప్రజావాణి కార్యక్రమం

## జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి వినతుల స్వీకరణ




**హన్మకొండ, 23 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో, హనుమకొండ పరకాల ఆర్డీవో కార్యాలయాలు, మండల కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ ప్రకటనలో తెలియజేశారు.

# పేదలకు అండగా అమ్మ నాన్న చారిటబుల్ ట్రస్ట్



**హన్మకొండ, 23 ఆగస్ట్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 31వ డివిజన్ మాలగుట్ట పరిసర ప్రాంతాల్లో అమ్మ నాన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పేద కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే స్థానికంగా పర్యటించి రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సూచించారు. పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అమ్మ నాన్న చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు గంజి శ్రీనివాస్ రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ట్రస్ట్ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.



# దళిత మహిళపై అత్యాచారానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి - హోంమంత్రికి విజ్ఞప్తి

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

కర్ణాటక రాష్ట్ర హోంమంత్రి ప్రియాంక్ ఖర్గేను కన్నల్లి కృష్ణప్ప, కర్ణాటక సామరస్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ముని అంజనప్ప రాష్ట్ర అధ్యక్షుడు ప్రజా విమోచన చలువలి స్వాభిమాన, వెంకటరమణప్ప సమత సైనిక దళ్ రాష్ట్ర అధ్యక్షుడు. బెల్తార్ వెంకటేష్ రాష్ట్ర అధ్యక్షుడు కర్ణాటక రిపబ్లికన్ సంఘం,కడుగుడి సోన్నప్ప రాష్ట్ర అధ్యక్షుడు దళిత క్రియ వేదిక ఇంకా పలువురు నాయకులు కలిసి రాయచూరు జిల్లాలో దళిత మహిళపై జరుగుతున్న అత్యాచారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాయచూర్ జిల్లా, శిర్వారా దళిత మహిళ అశ్విని పై అత్యాచారం చేసి దారుణంగా హత్య చేసిన ఘటన: దోషులకు మరణశిక్ష విధించాలని, లేకపోతే అత్యాచారానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేయాలని భీమా సంఘం నిర్ణయించింది. కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ జిల్లా, శిర్వారా ప్రాంతంలోని హోక్రానికి చెందిన షెడ్యూల్డ్ కుల బాలిక కుమారి అశ్విని బహిరంగ మరుగుదొడ్డికి వెళ్లగా, కొందరు స్థానిక దుండగులు ముందస్తు పథకం ప్రకారం ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడి, దారుణంగా హత్య చేసి, మృతదేహాన్ని బహిరంగ బావిలో పడేసి పారిపోవడం తీవ్రంగా ఖండనీయం. యావత్ సమాజాన్ని సిగ్గుపడేలా చేసిన ఇటువంటి అమానుష చర్యను భీమా సంఘటన మహా కూటమి తీవ్రంగా ఖండిస్తుంది. స్థానికుల సమాచారం ప్రకారం, పోలీసులు ఇప్పటికే ముగ్గురు అత్యాచార నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపారు. మిగిలిన నిందితులను అరెస్టు చేయకపోవడం అనుమానాలను రేకెత్తిస్తోంది. కుమారి అశ్వినిపై జరిగిన సామూహిక అత్యాచారంలో ప్రమేయం ఉన్న మిగిలిన ప్రధాన నిందితులందరినీ పోలీసులు ఎలాంటి సంకోచం లేకుండా అరెస్టు చేసి, న్యాయస్థానం ముందు నిలబెట్టడం అత్యవసరం. సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారందరికీ దేశ చట్టం ప్రకారం ఎలాంటి సంకోచం లేకుండా మరణశిక్ష విధించాలని భీమా సంఘటన మహా కూటమి ఒక వినతిపత్రం ద్వారా డిమాండ్ చేస్తోంది. భీమా సంఘటన మహా కూటమి ఆగస్టు 25న రాయచూర్ జిల్లా, శిర్వరలోని బాధితురాలి ఇంటికి వెళ్లనున్నారు.



# “ఐదు-ఆరు సమాధులేనా?”

**అవశేషాలను చేతుల్లోకి తీసుకుని కన్నీటిపర్యంతమైన కుమారుడు**
**సమాధుల కూల్చివేతపై తీవ్ర ఆవేదన**
**మానవత్వం ఎక్కడంటూ ప్రజల రోదన**

**గోపాలపూర్, 23 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

“ఐదు-ఆరు సమాధులే కదా.. వాటికోసం ఇంత బాధ ఎందుకు?” అంటూ మాట్లాడటం సులువే కావచ్చు. కానీ ఆ సమాధుల్లో ఒకరి తండ్రి జ్ఞాపకం ఉందని, ఒక కుటుంబానికి అవి తరతరాల అనుబంధానికి గుర్తులని గుర్తిస్తే పరిస్థితి మరోలా కనిపిస్తుంది. సమాధుల కూల్చివేత ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ తండ్రి సమాధిని తొలగించిన అనంతరం బయటకు వచ్చిన అవశేషాలను చూసి ఓ కుమారుడు కన్నీటిపర్యంతమైన ఘటన అక్కడున్న వారిని కలచివేసినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. తండ్రి సమాధి వద్ద లభించిన అవశేషాలను స్వయంగా చేతుల్లోకి తీసుకుని గుండెలకు హత్తుకుని “నాన్నా.. నాన్నా..” అంటూ ఆ కుమారుడు విలపించిన దృశ్యం అక్కడున్న వారిని తీవ్రంగా కలిచివేసింది. సమాధి అనేది కేవలం మట్టి, రాళ్లతో కూడిన నిర్మాణం కాదని, తమ కుటుంబ సభ్యుల జ్ఞాపకాలను మోస్తున్న పవిత్ర స్థలమని బాధితులు చెబుతున్నారు.





**“అది సమాధి కాదు.. మా నాన్న జ్ఞాపకం”**

ఒక వ్యక్తికి ఆ ప్రదేశం సాధారణ సమాధిగా కనిపించవచ్చు. కానీ ఆ కుటుంబానికి మాత్రం అది వారి తండ్రి జ్ఞాపకం. చిన్ననాటి నుంచి తనను పెంచిన వ్యక్తి, జీవితంలో తనకు అండగా నిలిచిన వ్యక్తి చివరి జ్ఞాపకం అక్కడే ఉందని బాధిత కుమారుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. “అవి కేవలం ఎముకలు కావు.. నా నాన్నవి” అనే భావనతో వాటిని చేతుల్లోకి తీసుకున్న ఆ కుమారుడి పరిస్థితి చూసి సమాధుల సంఖ్యపై వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

**సంప్రదాయాలకు ప్రతీకగా సమాధులు**

తరతరాలుగా తమ కుటుంబ పెద్దలను సమాధి చేసి, వారి జ్ఞాపకాలను కాపాడుకోవడం తమ సంప్రదాయమని బాధిత కుటుంబాలు పేర్కొంటున్నాయి. అందువల్ల సమాధులను తొలగించే ముందు సంబంధిత కుటుంబాల భావోద్వేగాలను, సంప్రదాయాలను పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరుతున్నారు. “ఒకరి తండ్రి మనకు తెలియని వ్యక్తి కావచ్చు. కానీ అతని కుమారుడికి మాత్రం ఆయనే ప్రపంచం. అందుకే సమాధిని కూల్చడం అంటే కేవలం మట్టి తొలగించడం కాదు.. ఒక కుటుంబం గుండెల్లో ఉన్న జ్ఞాపకాన్ని గాయపరచడం” అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి**

సమాధుల తొలగింపు ఎందుకు జరిగింది? ఎవరి అనుమతులతో జరిగింది? ముందుగా సంబంధిత కుటుంబాలకు సమాచారం ఇచ్చారా? అవశేషాలను ఎలా తరలించారు? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధిత కుటుంబాల భావోద్వేగాలను గౌరవిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. “సమాధుల సంఖ్య ఐదు కావచ్చు.. ఆరు కావచ్చు.. కానీ ప్రతి సమాధి వెనుక ఒక కుటుంబం, ఒక జ్ఞాపకం, ఒక బంధం ఉంటుంది. ఆ బంధాన్ని గౌరవించడం మానవత్వానికి గుర్తు” అని బాధితులు పేర్కొన్నారు.

# ఐసీఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ సభలను జయప్రదం చేయాలి






**కేయూ క్యాంపస్, 23 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో హనుమకొండలో నిర్వహించనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య 90వ వార్షికోత్సవ ముగింపు సభలను జయప్రదం చేయాలని రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఇన్‌చార్జి రెహమాన్ పిలుపునిచ్చారు. కాకతీయ విశ్వవిద్యాలయ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించి, ఖాళీగా ఉన్న బోధనా, బోధనేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారీకరణ చేసే విధానాలను విరమించుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి భాష బోయిన సంతోష్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని, శిథిలావస్థలో ఉన్న సంక్షేమ వసతి గృహాలను పునరుద్ధరించాలని, విద్యార్థుల పెండింగ్ భోజన, సౌందర్య సాధనాల ఖర్చులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సభలను విజయవంతం చేయాలని విద్యార్థులు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఊట్కూరి ప్రణీత్ గౌడ్, ఉపాధ్యక్షులు శ్రీపతి వినయ్, వేల్పుల చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె వద్దు.. సమస్యలు పరిష్కరిస్తాం

**ఆటో, క్యాబ్ డ్రైవర్లకు మంత్రి పొన్నం భరోసా**
**నేటి అర్ధరాత్రి నుంచి తలపెట్టిన బంద్‌ను విరమించాలని ఆటో డ్రైవర్లకు మంత్రి పొన్నం విజ్ఞప్తి**
**ఛార్జీల సవరణపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ**
**ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడి**
**పాత ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోలు కొంటే ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తామన్న మంత్రి**




**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ఇవాళ అర్ధరాత్రి నుంచి తలపెట్టిన నిరవధిక బంద్‌ను విరమించుకోవాలని ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లకు తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమ్మెల ద్వారా సమస్యలు పరిష్కారం కావని, చర్చలతోనే సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, వారు చర్చలకు సహకరించాలని కోరారు. హుస్నాబాద్‌లో పర్యటించిన సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఆటో కార్మికుల ప్రధాన డిమాండ్లలో ఒకటైన ఛార్జీల సవరణపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలో 2015 నుంచి ఆటో ఛార్జీలు పెరగలేదన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, పెరుగుతున్న నిర్వహణ వ్యయాలను దృష్టిలో ఉంచుకుని ఛార్జీల పెంపుపై అధ్యయనం చేసేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కమిటీలో రవాణా శాఖ అధికారులతో పాటు ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులకు కూడా స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, ఆటో కార్మికుల కోసం ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కేబినెట్ ఇప్పటికే నిర్ణయం తీసుకుందని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ బోర్డు కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలుగా మార్గదర్శకాలను త్వరలోనే ఖరారు చేస్తామని పేర్కొన్నారు. గతంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలను ఎంత సీరియస్‌గా తీసుకుని పరిష్కరించామో, అదే రీతిలో ఆటో కార్మికుల సమస్యలనూ పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆటో డ్రైవర్ల ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకుని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి తెలిపారు. పాత డీజిల్, పెట్రోల్ ఆటోలను స్క్రాప్ చేసి కొత్త ఎలక్ట్రిక్ ఆటోలను కొనుగోలు చేసే డ్రైవర్లకు ప్రభుత్వ సహకారం అందిస్తామన్నారు. అలాగే, పాత వాహనాలను గ్రీన్ ఎనర్జీలోకి మార్చుకునేందుకు (రెట్రోఫిట్టింగ్) త్వరలోనే ఒక కొత్త పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో, ఆటో, క్యాబ్ డ్రైవర్లు తమ బంద్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, ప్రభుత్వంతో చర్చలకు ముందుకు రావాలని పొన్నం ప్రభాకర్ మరోసారి కోరారు.



# 13 ఏళ్ల కెరీర్ పై రాశీ ఖన్నా ఏమన్నారంటే...!

**సినీ రంగంలో 13 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న నటి రాశీ ఖన్నా**
**‘మద్రాస్ కేఫ్’ చిత్రంతో తన కెరీర్ ప్రారంభమైందని వెల్లడి**
**పనిని అదృష్టంగా భావించడం వల్లే సమయం తెలియలేదన్న రాశీ**
**ప్రస్తుతం ‘ఫర్జీ 2’ వెబ్ సిరీస్ చిత్రీకరణలో బిజీగా ఉన్న నటి**
**రజనీకాంత్, అక్షయ్ కుమార్ సరసన రాబోయే చిత్రాల్లో నటించనున్న వైనం**

ప్రముఖ నటి రాశీ ఖన్నా భారత చిత్ర పరిశ్రమలో తన 13 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. 2013లో ‘మద్రాస్ కేఫ్’ చిత్రంతో నటిగా అరంగేట్రం చేసిన ఆమె, అప్పటి నుంచి సమయం చాలా వేగంగా గడిచిపోయిందని అన్నారు. పనిని ఎల్లప్పుడూ ఒక అదృష్టంగా భావించడం వల్లే తనకు అలా అనిపించిందని పేర్కొన్నారు. ఇటీవల ‘120 బహదూర్’ చిత్రంలో ప్రత్యేక పాత్రలో కనిపించిన రాశీ, తన కెరీర్‌ను గుర్తుచేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ ప్రయాణం గురించి రాశీ ఖన్నా మాట్లాడుతూ, “పదమూడేళ్లు సుదీర్ఘ సమయం. కానీ, పనిని ఎప్పుడూ ఒక అదృష్టంగానే భావించాను కాబట్టి సమయం తెలియలేదు. ‘మద్రాస్ కేఫ్’ రోజుల్ని గుర్తుచేసుకుంటే, నా ప్రయాణం ఎందుకు మొదలైందో తెలుస్తుంది. నేను చెప్పాలనుకున్న కథలకు ఆ సినిమా అవకాశం ఇచ్చింది. ఈ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు” అని తెలిపారు. ‘మద్రాస్ కేఫ్’ తర్వాత ఆమె కెరీర్ వేగం పుంజుకుంది. తొలి సినిమా నుంచే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాశీ ఖన్నా, హిందీ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో విజయవంతంగా రాణిస్తున్నారు. విభిన్న భాషల్లో నటించడం కేవలం యాదృచ్ఛికం కాదని, స్పష్టమైన ప్రణాళికతోనే బహుభాషా నటిగా పాన్-ఇండియా స్థాయిలో గుర్తింపు పొందారని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం రాశీ ఖన్నా పలు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో రూపొందుతున్న ‘ఫర్జీ’ వెబ్ సిరీస్ రెండవ సీజన్‌లో ఆమె నటిస్తున్నారు. షాహిద్ కపూర్, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో ఆమె ఆర్‌బీఐ అధికారిణి మేఘా వ్యాస్ పాత్రను మరోసారి పోషించనున్నారు. దీనితో పాటు, సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా రాబోతున్న తమిళ యాక్షన్ థ్రిల్లర్ ‘ధర్మన్’లోనూ, బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ హీరోగా అనీస్ బాజ్మీ తెరకెక్కిస్తున్న కామెడీ డ్రామాలోనూ ఆమె హీరోయిన్‌గా కనిపించనున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE


## నాన్‌వెజ్ వల్ల ఇన్ని సమస్యలు వస్తాయా?



ప్రతి రోజూ నాన్ వెజ్ తింటే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. ప్రతి రోజూ నాన్ వెజ్ ఐటెమ్స్ తినే వారిలో ఖచ్చితంగా కొన్ని వ్యాధులు వస్తాయట. ఆహార అలవాట్లు.. శరీర ఆరోగ్యం మీదనే కాకుండా.. మానసిక ఆరోగ్యం మీద కూడా ప్రభావం చూపిస్తుంటాయి. రోజూ ఫాస్ట్ ఫుడ్స్, లేదా మాంసం తినే వారిలో సాధారణంగా డయాబెటీస్, బీపీ, క్యాన్సర్, ఊబకాయం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు వస్తాయి. అంతేకాదు మతి మరుపు కూడా వచ్చే అవకాశం ఉందట. ప్రతిరోజూ మాంసం తినే వారిలో వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది. ఎలా అనుకుంటున్నారా? ఆస్ట్రేలియాలోని బాండ్ యూనివర్శిటీలో 438 మంది వ్యక్తులపై పరిశోధన చేశారు ఆరోగ్య నిపుణులు. ఆహారపు అలవాట్లు జ్ఞాపకశక్తిపై ఎలా పని చేస్తున్నాయో తెలుసుకున్నారు. ఈ అధ్యయనం 438 మంది కొనసాగితే అందులో 108 మందికి అల్జీమర్స్ వ్యాధి వచ్చినట్టు తేలిందట. దీని ప్రకారం ఎక్కువగా నాన్ వెజ్ తింటే వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వస్తుంది అంటున్నారు నిపుణులు. అంటే ఇంట్లో మనుషులను కూడా గుర్తించలేని పరిస్థితి కూడా వస్తుందట. ప్రతిరోజూ మాంసం తినేవారిలో అధిక బరువు, హై కొలెస్ట్రాల్, డయాబెటీస్, బీపీ, ఫ్యాటీ లివర్, గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం మరింత ఎక్కువ ఉంటుందట. ఈ సమస్యలు మాత్రమే కాదు ప్రతి రోజూ నాన్ వెజ్ తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు కూడా వస్తాయట. రోజూ పండ్లు, కూరలు, గింజలు తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు అసలు కనిపించడం లేదని పరిశోధనలో తేలిందట. మాంసాహారాలు ఎక్కువగా తీసుకుంటే నరాల సమస్యలు వస్తాయి సో స్కిప్ చేయండి. ఎక్కువగా తినకుండా లిమిట్ గా తినడం వల్ల ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. అతి సర్వత్రా వర్జయేత్. సో మితంగా తిని ఆరోగ్యంగా ఉండండని సలహా ఇస్తున్నారు నిపుణనలు.

## పెరుగు వల్ల ఇన్ని ప్రయోజనాలు ఉంటాయా?

పేగులకు మంచిది: పెరుగు లోని ప్రోబయోటిక్స్ పేగులు బాగా పనిచేయడానికి సహాయపడుతుంటాయి. కడుపు ఉబ్బరాన్ని తగ్గించే శక్తి కూడా ఈ పెరుగుకు ఉంటుంది. మానసిక ఒత్తిడి: పెరుగులోని యాంటీఆక్సిడెంట్లు, మంచి కొవ్వులు, ప్రోబయోటిక్‌లు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తిని పెరుగు తగ్గిస్తుంది. ఈ హార్మోన్ నియంత్రణలో ఉంటే బరువు తగ్గుతుంటారు. జ్ఞాపకశక్తి మెరుగుదల: జ్ఞాపకశక్తిని పెంచుకోవాలనుకుంటే ప్రతిరోజూ పెరుగు తినాలి అంటున్నారు నిపుణులు. పెరుగులోని కాల్షియం, విటమిన్ డి జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి సహాయం చేస్తుంది. చర్మ సంరక్షణ: పెరుగు తినేవారి చర్మం పొడిబారకుండా ఉంటుంది. తేమ వల్ల యవ్వనంగా కనిపిస్తారు కూడా. దురద ఉంటే కూడా పెరుగు తినడం వల్ల ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు అంటున్నారు నిపుణులు. పెరుగులోని జింక్, విటమిన్ సి, కాల్షియం చర్మానికి ఎంతో మేలు చేస్తుంటాయి. ఎముకలు, దంతాల బలం : ఎముకలు, దంతాలను బలోపేతం చేస్తుంది ఈ పెరుగు. వీటికి అవసరమైన ఫాస్ఫరస్, కాల్షియం లు కూడా ఇందులో ఉంటాయి. దీన్ని ప్రతిరోజూ తినడం వల్ల దంతాలు చాలా స్ట్రాంగ్ గా ఉంటాయి. ఎముకలను కూడా బలోపేతం చేయడం వల్ల కీళ్లనొప్పులు రాకుండా నిరోధించుకోవచ్చు. బిపి %ూ% షుగర్ నియంత్రణ: పెరుగులోని పోషకాలు సులభంగా జీర్ణం అవడానికి కూడా ఈ పెరుగు ఉపయోగపడుతుంది. దీనిలోని ప్రోటీన్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. పెరుగులో ఉండే మెగ్నీషియం అధిక రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యం: ప్రతిరోజూ పెరుగు తీసుకునే వారికి కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి అంటున్నారు నిపుణులు. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. దీని వల్ల గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. మెదడుకు మంచిది: పెరుగులో ఉండే ప్రోటీన్ మెదడు కణాల పెరుగుదల , నిర్వహణకు సహాయపడుతుంది అంటున్నారు నిపుణులు. పెరుగు, పంచదార రెండింటినీ కలిపి తింటే మెదడుకు మంచిదట. ఎందుకంటే పెరుగుతో పాటు పంచదార తిన్నప్పుడు లభించే గ్లూకోజ్ మెదడు శక్తిని పెంచడానికి మరింత సహాయపడుతుంది. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది పెరుగు. ఇందులోని టైరోసిన్ వంటి అమైనో ఆమ్లాలు మెదడులో డోపమైన్, సెరోటోనిన్, నోర్‌పైన్‌ఫ్రైన్ వంటి హార్మోన్‌లను నియంత్రిస్తాయి.



# క్రమశిక్షణ "చర్యల్లో "కక్ష "సాధింపులు









**అధికారం ముందు ప్రజాబలం ఓడిపోతుంది.**
**మధ్యస్థంగా ఎదిగిన నాయకులు రాజకీయాలను శాసిస్తున్నారు.**
**అధికార పదవుల కోసం పతాక స్థాయిలో దిగజారుతున్నారు.**
**కొండా సుస్మిత పటేల్ వాక్యాలపై ఎందుకింత దుమారం.**
**బీసీ మంత్రి కొండా సురేఖను ఇంకెంతకాలం టార్గెట్ చేస్తారు.**
**అగ్రవర్ణాల విమర్శలపై క్రమశిక్షణ చర్యలు ఎక్కడ.**
**కాంగ్రెస్ పార్టీ విచ్ఛిన్నానికి కుట్రలు పన్నుతున్నది ఎవరు.**
**వ్యాపారాలు, పైస సంపాదన, అధికార పదవులు ఇవే నా అభివృద్ధి అంటే.**
**ప్రజల మేలు కోరలేకపోతున్న ప్రజా ప్రతినిధులు.**
**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు పట్ల తీవ్ర అసంతృప్తిలో ఉంటున్న ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులు.**
**మంత్రి సురేఖపై చర్యలకు పూనుకుంటే రాష్ట్రం అట్టోడుకుతుంది.**
**ప్రభుత్వం ప్రతిపక్షాలపై దూషిస్తున్న మాటల కన్నా సుస్మితా పటేల్ మాటలు పెద్దవా.!**
**రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో రెచ్చగొట్టే మాటలు మానుకోండి.**
**డాక్టర్ బరిగెల శివ.**

**హైదరాబాద్ జై భీమ్ డెస్క్:-**

రాజకీయ కక్ష సాధింపులతో రాష్ట్రాన్ని పాడుచేయొద్దని డాక్టర్ బరిగెల శివ వాక్యానించారు.తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా రాజకీయ పరిపాలన అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోతుందన్నారు. ప్రజల విశ్వాసానికి అనుకూలంగా పనిచేయాల్సిన ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు ప్రాధాన్యత నిస్తున్నట్లుగా ప్రజలు ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో ఆరోపిస్తున్నారని గుర్తు చేశారు.దేశంలో ప్రజాస్వామ్య విలువల కొరకు పాటుపడుతున్న కేంద్ర ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పరిపాలనపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించకపోవడం వల్ల రాష్ట్రంలో ఇష్టారాజ్య పాలన పెరిగిపోయిందని వాపోయారు.వ్యాపారాలు, భూ సెటిల్మెంట్లు, ఉద్యమాల అణిచివేతలు తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువగా పెరిగిపోతున్నాయని ఆక్షేపించారు.రాజకీయ విలువలకు కట్టుబడి పని చేయాల్సిన నాయకులందరూ రాజకీయ విలువలను వినమరుస్తున్నారని మండిపడ్డారు.ఆచరణకు సాధ్యం కానీ హామీలను నెరవేర్చే క్రమంలో జరుగుతున్న తీవ్రమైన ఆలస్యాన్ని ప్రజలు తప్పుపడుతూ ఉండడమే కాకుండా పూర్తిస్థాయిలో విమర్శిస్తున్నారు అన్నారు.



**కక్ష సాధింపులే కమ్మని చర్యలా.. జాతీయ కాంగ్రెస్ పార్టీ ఉనికి దెబ్బతింటుందా.!**

ఏ రాజకీయ పార్టీ అయినా పార్టీ కార్యకలాపాలలో గాని పార్టీ నియమాలను ఉల్లంఘించిన సందర్భాలలో క్రమశిక్షణ చర్యలకు అర్హులుగా బాధ్యతలను తీసుకోవడం ఆనవాయితేనని అలాంటి క్రమశిక్షణ చర్యలకు కొంత మందిని బాధ్యులను చేస్తూ మరి కొంతమందికి మినహాయింపు కల్పిస్తుండడం అధికార పార్టీకి అంత మంచిది కాదని హితవు పలికారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వం పైన గాని,మంత్రుల పైన గాని,ప్రజా ప్రతినిధుల పైన గాని,ముఖ్యమంత్రిపై గానీ నిరంతర విమర్శలు వస్తున్నాయని అలాంటి వాటిని పరిగణలోనికి తీసుకొని చర్యలు చేపట్టే క్రమంలో ప్రభుత్వానికి సానుకూలంగా ఉన్న ప్రజాప్రతినిధులపై చర్యలకు ఉపక్రమిస్తూ ప్రభుత్వానికి అంటిముట్టనట్టుగా ఉంటున్న నాయకులపై ప్రజాప్రతినిధులపై మంత్రులపై చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారని తెలంగాణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నరన్నారు.మహిళా ప్రజాప్రతినిధులను ఘోరంగా అవమాన పరుస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారన్నారు.

**సొంతగూటిలో పొంతన లేదు..**

ఈ మధ్యకాలంలో తరచుగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖపై రాజకీయపరమైన అభియోగాలు మోపడం మహిళా బీసీ నాయకురాలును అవమాన పరుస్తున్నారు అంటూ రాష్ట్ర బీసీ సంఘం నేతలు బిసి ఉప కులాలు పెద్ద ఎత్తున ఆందోళన చేశాయని గుర్తు చేశారు.చెన్నారెడ్డి, జీవన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, తీన్మార్ మల్లన్న,దానం నాగేందర్ లాంటి ప్రధాన నాయకులు సొంత పార్టీ వాళ్లు అయినప్పటికీ సీఎంపై కాంగ్రెస్ పాలనపై విమర్శలు చేస్తుండగా ఇప్పటివరకు ఏ ఒక్కరిపై అనుకున్న విధంగా చర్యలు తీసుకోలేకపోయారని గుర్తు చేశారు.ఒక బీసీ మహిళ మంత్రి కొండా సురేఖ విషయానికి వచ్చేసరికి ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం కోసం ఉరకలు వేస్తుందని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ కొత్తలో కొండా సురేఖ ప్రతిపక్షాలపై దీటుగా స్పందిస్తూ సీఎం రేవంత్ రెడ్డికి అండగా నిలిచిన సంగతిని పూర్తిగా విడమరుస్తున్నారని గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన రాజకీయ పరిపాలనను జాతీయ కాంగ్రెస్ పార్టీ చూసుకోవలసి ఉంటుండగా టికెట్ల కేటాయింపులో గాని పదవుల కేటాయింపులో గాని పూర్తిస్థాయి నాయకత్వాన్ని జాతీయ కాంగ్రెస్ పార్టీ వహిస్తుండటంతో పాటు,అన్నింటిని స్పష్టంగా నిర్ధారిస్తుందని అన్నీ సందర్భంలో తెలిపిన విధంగా కొన్నిచోట్ల రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పలానా వ్యక్తులకు సీట్లు కేటాయిస్తాం అని ప్రకటించడం రాజకీయ కాంగ్రెస్ పార్టీ వర్గీయులలో దుమారం లేపిందని గుర్తుచేశారు. ఈ మధ్యకాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరకాల నియోజకవర్గం శాసనసభ స్థానాన్ని ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి కేటాయిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోగా అట్టి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంత్రి కొండా సురేఖ,మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు కుమార్తె కొండా సుస్మిత పటేల్ అభ్యంతరాన్ని వ్యక్తపరుస్తూ సీఎంను వ్యక్తిగతంగా సంబోధిస్తూ మాట్లాడడం తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో ఒక్కసారిగా

**ఆవేశపురితజ్వాలలను రెచ్చగొట్టినట్టైందన్నారు..**

అంతటితో ఆగకుండా రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఒక్కసారిగా విరుచుకుపడి కొండా సుస్మిత పటేల్ పై విపరీతమైన వ్యతిరేకతను కనపరుస్తూ పత్రిక సమావేశాలు నిర్వహిస్తూ బహిరంగంగా దూషణలకు దిగిన సంఘటనను రాష్ట్రవ్యాప్తంగా చూసామన్నారు.అందులో భాగంగానే మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ శోకాజు నోటీసు జారీ చేయడం వివరణ కోరడం మంత్రి సురేఖ తన కూతురు సుస్మిత పటేల్ వాక్యాలతో తమకు ఏ విధమైన సంబంధం లేదని అది పూర్తిగా సుస్మిత వ్యక్తిగతమైన విషయంగా నిర్ధారిస్తూ వివరణను ఇచ్చినప్పటికీ రాష్ట్రంలో మంత్రి సురేఖను టార్గెట్ చేస్తూ ఇతర పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోనికి వలసలకు వచ్చిన నేతలందరూ మహిళా మంత్రిని తీవ్రంగా విమర్శిస్తున్నారని తెలిపారు.రాష్ట్రంలో రాజకీయ స్వార్థం పెరిగిపోతుండగా కేవలం ఒక బీసీ మహిళ నాయకురాలిని టార్గెట్గా చేసుకొని ఇప్పటికీ వేధింపులకు గురిచేయడం సరైనది కాదన్నారు.గతంలో జరిగిన అల్లర్లను, గొడవలను పరిగణలోనికి తీసుకొని ఇతర మంత్రులు ఏ విధంగానైతే సంధి కుదుర్చారో ప్రస్తుతం జరిగిన గొడవ పతాక స్థాయికి వెళ్లడంతో ఒకరిపై మరొకరు విమర్శలు గుప్పించుకుంటూ వ్యక్తిగతమైన దూషణదాడులకు పాల్పడుతున్నారని అన్నారు.ముఖ్యంగా కొండా సుస్మిత పటేల్ సీఎం రేవంత్ రెడ్డి సోదరుల వ్యాపారాలపై ఘాటుగా స్పందిస్తూ మాట్లాడుతున్న మాటలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఒక్కసారిగా చర్చనీయాంశంగా మారిపోగా రాష్ట్ర ప్రజలు ఇరువర్గాల అభియోగాలను క్షుణ్ణంగా పసిగడుతున్నారని గుర్తు చేశారు.ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ప్రధాన శాఖలను తన వద్ద పెట్టుకొని పరిపాలిస్తుండడం 40 సంవత్సరాలుగా రాజకీయ పార్టీలో ఉంటున్న ఒరిజినల్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఏమాత్రం తట్టుకోలేకపోతున్నారని ఇంచుమించు మూడు సంవత్సరాల కాలం గడుస్తున్న మంత్రి పదవుల కూర్పులో ఎలాంటి ప్రయోగాలు జరగకపోవడం మంత్రి పదవులు ఆశిస్తున్న నాయకులతోపాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధిష్టానంపై ఒకింత అసంతృప్తిగా, నిరుత్సాహంగాను ఉన్నారని పేర్కొన్నారు.ఇతర పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోనికి చేరిపోయిన నాయకులందరూ టిడిపి బీఆర్ఎస్, బిజెపి పార్టీలకు తొత్తులుగా మారి కాంగ్రెస్ పార్టీ ఉనికిని దెబ్బతీస్తున్నారని కేవలం రాజకీయ స్వార్థాల కోసమే,సంపాదన కోసమే,అక్రమంగా సంపాదించుకున్న ఆస్తులను కాపాడుకోవడం కోసమే దగుల్బాజీ రాజకీయాలకు పాల్పడుతున్నట్లుగా రాష్ట్ర పరిపాలన విధానాలు కనిపిస్తున్నాయన్నారు.మరోవైపు రాష్ట్రంలో పెరిగిపోతున్న అక్రమ వ్యాపారస్తుల వ్యాపారాల జోరు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా దెబ్బతీస్తుందని మండిపడ్డారు.హైదరాబాదులో ఒకవైపు హైడ్రా పూర్తిస్థాయిలో విజృంభిస్తూ భూకబ్జాదారులను కట్టడం చేస్తుంటే మరోవైపు,ప్రభుత్వ, ప్రైవేటు వందలాది, వేలాది ఎకరాలలో, విల్లాల నిర్మాణాలు జోరుగా కట్టబడుతున్నాయన్నారు. రాజకీయ వర్గాలను రాజకీయ విశ్లేషకులను సంతృప్తి పరచడం కోసం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం ప్రయత్నం చేస్తున్నట్లుగా కనిపించలేకపోవడంతో నిరుద్యోగులు, రైతులు,విద్యార్థులు ప్రభుత్వంపై,కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, క్షేత్రస్థాయి వ్యతిరేకతతో ఉన్నట్లుగా కనిపిస్తుందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ గొడవలపై జాతీయ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ తక్షణమే చొరవ తీసుకొని కాంగ్రెస్ ప్రభుత్వ ఉనికిని కాపాడాలని లేనియెడల ప్రతిపక్షాలకు అలుసుగా కాంగ్రెస్ ప్రభుత్వ గొడవలు మారిపోక తప్పదు అంటూ హెచ్చరించారు.కొండ సుస్మిత పటేల్ మాటలు పూర్తిగా వ్యక్తిగతమని పదేపదే తెలుపుతున్నప్పటికిని మహిళా మంత్రిపై కక్ష సాధింపులకు దిగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకునే ప్రయత్నం చేయగలిగితే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పూర్తిగా దెబ్బతినే ఆస్కారం ఉందని తెలియజేశారు.రాజకీయ కక్ష సాధింపుల కన్నా ప్రజాబలాన్ని కూడబెట్టుకోవడానికి ఉన్న కాస్త కాలాన్ని సద్వినియోగం చేసుకొని తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను సంతృప్తి పరచాలని లేనియెడల కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో గట్టెక్కడమనేది సర్వ కష్టమన్నారు.